వసతులు కల్పించాలని ఎంపీకి వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం నివాసితులు

నిజాంపేట్: బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ నివాసితులు ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 10 బ్లాకులల్లో 1080 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. నీటి వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని, బస్తీ దవాఖానా, శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. త్వరలోనే డబుల్ బెడ్‌రూమ్‌లను సందర్శించి, సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వాసవి ఎన్‌క్లేవ్ రెసిడెన్షియల్ అసోసియేషన్ ఎన్నిక



నిజాంపేట్: వాసవి ఎన్‌క్లేవ్ రెసిడెన్షియల్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా భవానీ ప్రసాద్, కోశాధికారిగా రమేష్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్, మల్లేశ్, రమాకాంత్‌రెడ్డి, సాంబశివరావు, అడ్వైజర్‌గా సత్య, జాయింట్ సెక్రటరీగా శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సుబ్బారావు, మధు, శ్రీకాంత్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, కల్చరల్ సెక్రటరీలుగా జగదీష్, మూర్తి, వెంకటేశ్వర్‌రావు, శ్రీధర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ అండ్ ఆర్గనైజింగ్ సభ్యులుగా 26 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నిజాంపేట్: ప్రగతి నగర్‌లోని వాసవి లేఅవుట్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దవా ఇండియా జనరిక్ మెడిసిన్ సౌజన్యంతో వాసవి రెసిడెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

22న హనుమాన్ జయంతి ఉత్సవాలు

కుత్బుల్లాపూర్: ఈ నెల 22న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదాసాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 6:30 గంటలకు 108 సార్లు సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణం, 8:30 గంటలకు 108 లీటర్ల ఆవు పాలతో పంచామృతాభిషేకం, స్వామివారికి నూతన వస్త్రధారణ. లక్ష పత్రార్చన, లక్ష తమలపాకులతో అర్చన, సహస్రనామ స్తోత్ర పారాయణం, తీర్థ ప్రసాద గోష్ఠి, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ పేర్కొంది.

అంతంతే చెత్త సేకరణ..!

తడి, పొడి సేకరణలో సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం

- శివారుల్లో ఒక్కొక్క పురపాలికలో 40 నుంచి 65 టన్నుల చెత్త
- వాహనాలు సమయానికి రాక.. రోడ్లపైనే పారబోత
- ఇబ్బందుల్లో పుర ప్రజలు.. పట్టించుకోని కమిషనర్లు



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పురపాలికల్లో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతిరోజూ చెత్తను వేరుచేసి సేకరించాల్సి ఉన్నా.. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు ఉండగా, పోచారం, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, తూంకుంట, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, దుండిగల్, కొంపెల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. అలాగే రంగారెడ్డి జిల్లాలో మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు ఉన్నాయి. శివారుల్లో మొత్తంగా 29 పురపాలక సంఘాలు ఉండగా, లక్షకు పైగా జనాభా గల పురపాలికల్లో ప్రతీ రోజూ దాదాపు 65 టన్నులు, లక్ష లోపు జనాభా ఉన్న మున్సిపాలిటీల్లో 40 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. సంబంధిత అధికారులు చెత్త వాహనాలకు మైకులు పెట్టుకొని తడి, పొడి చెత్తను వేరుచేసి అందజేయాలని ప్రచారం చేస్తున్నా.. ఆచరణలో అమలు నోచుకోవడం లేదని తెలుస్తోంది.

సమయానికి రాక..

చెత్తను తరలించే వాహనాలు వార్డులు /డివిజన్లకు సమయానికి రాకపోవడంతో పలుచోట్ల చెత్తను రోడ్ల పక్కనే పారబోస్తున్నారు. ప్రతి వార్డు/డివిజన్‌కు వాహనంతో పాటు సిబ్బందిని కేటాయించినా..సేకరణలో అలసత్వం వహిస్తున్నారు. పోచారం పురపాలక సంఘం పరిధిలో సర్వీస్ రోడ్డు ప్రాంతాలతో సహా ఖాళీ ప్లాట్లు, స్థలాలతో సహా హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి సమీప ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా చెత్తను వేస్తున్నారు. ఇదే పరిస్థితి శివారుల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కూడా దాపురించడంతో ప్రజలు అనారోగ్యాలకు గురికావల్సి వస్తోంది.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పురపాలికల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించడం లేదని తెలుస్తోంది. కొన్ని వార్డుల్లో రెండు, మూడు రోజులకోసారి చెత్త తరలించే వాహనం రావడంతో అప్పటి వరకు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. చేసేది లేక కాలనీలో రోడ్ల వెంట పారబోస్తున్నారు. దీంతో తడి, పొడి చెత్త సేకరణ అమలుకు పునాది పడడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి తడి, పొడి చెత్త సేకరణ జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

దృష్టికి రాలేదంటున్న కమిషనర్లు

పురపాలికల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదనే విషయం తమ దృష్టికి రాలేదని సంబంధిత మున్సిపల్ కమిషనర్లు పేర్కొంటున్నారు. ఒకవేళ చెత్త సేకరణలో జాప్యం ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే డివిజన్లు/ వార్డుల వారీగా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించి.. తడి,పొడి చెత్తను వేరుచేసి సేకరించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



తాగునీటి సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మౌలిక వసతుల కల్పనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయదర్శిని ఎన్‌క్లేవ్‌లో నీటి సరఫరా పైపులైన్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, నూతనంగా వెలుస్తున్న కాలనీలలో వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కాలనీలో మిగిలిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

◆ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి మధురానగర్‌లో నిర్వహించిన డాక్టర్ యాసీనా భాను అభినందన సభ జరిగింది. ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై 2025 నీట్ ఎస్.ఎస్ పరీక్షలో జాతీయ స్థాయిలో 11వ ర్యాంకు సాధించిన డాక్టర్ యాసీనా భానును సన్మానించారు. వైద్య వృత్తిలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు.

◆ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శ్రీ బాలాజీ వెస్ట్ కౌంటీలో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీ ప్రజలు ఎంతో కాలంగా ఇబ్బందులు పడుతున్న భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, ఇతర సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ రాఘవేంద్రరావు, నాయకులు సాంబశివ రావు, బొబ్బ శ్రీనివాస్, సతీష్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు

నిజాంపేట్: పేద ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధి కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్‌లో బాచుపల్లి మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కార్మికులు బతికే పరిస్థితి నేడు లేదన్నారు. ఈ నెల 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను పాకిస్తాన్‌తో ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలిపారు. సమ్మెను జూలై 9న నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికుల పెండింగ్ బిల్లులు, జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శిగా పాలబిందెల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ర్యక్రమంలో యాదయ్య, శ్యామ్, బాలకృష్ణ, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వాగత్‌నగర్‌లో సీసీ రోడ్డు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. సూరారం కాలనీ స్వాగత్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే సహకారంతో ఇప్పటికే కోట్లాది నిధులతో మౌలిక వసతులను కల్పించామని, మిగతా ప్రాంతాల్లో సైతం పూర్తి చేసేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ జనరల్ సెక్రెటరీ శివాజీ, సునీల్, యువరాజ్, సాయిరాజ్, ధనుంజయ్, ప్రవీణ్‌రెడ్డి, నవీన్ రెడ్డి, వీరేష్, బిట్టు, ప్రభాకర్, విజయ్ నారాయణ రెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో బీజేపీదే అధికారం : ఎంపీ



కూకట్‌పల్లి: తెలంగాణలో రానున్న రోజుల్లో బీజేపీదే అధికారమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం, ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది ప్రజల కోసం పోరాడే పార్టీ అని, ప్రధానమంత్రి నాయకత్వంలో భారతదేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. కార్యాలయం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలని స్థానిక నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎస్. మల్లారెడ్డి, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. లైట్లు వెలుగక!

నగరంలో అతిపెద్ద చెరువులలో జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ ఒకటి. జీడిమెట్లలోని 44వ జాతీయ రహదారి నుంచి నర్సాపూర్ బాలానగర్ రహదారికి ఫాక్స్‌సాగర్ చెరువు కట్ట, జీడిమెట్ల పారిశ్రామికవాడ మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రెండు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ కట్టపై విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళలో అంధకారం నెలకొంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి చెరువు కట్టపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – సుభాష్‌నగర్



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం 26వ వార్డు ప్రశాంతి హిల్స్ అపార్ట్‌మెంట్ నివాసితులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. సమస్యలు పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అల్లాడి మహేష్‌గుప్తా, నారాయణరెడ్డి, రామచంద్ర నాయక్, లింగాల గంగాధర్, మౌలేశ్వర రావు, మేకల బాలకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, బాలకృష్ణ, ప్రశాంత్‌రెడ్డి, గౌస్, శ్రీనివాస్‌రాజు, శివ నాగరాజు యాదవ్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు జారిందో..!



రంగారెడ్డినగర్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో సిబ్బంది ప్రాణాలు గాల్లో దీపాలుగా మారుతున్నాయి. షాపూర్‌నగర్‌లోని రంగ భుజంగ చౌరస్తాలో ఇటీవల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ రహదారి మీదుగా ఎల్‌సీ లేన్ ఉండటంతో స్తంభాలు రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఈ క్రమంలో పలుసార్లు 'సాక్షి'లో వార్త కథనాలు ప్రచురితం కాగా ఎట్టకేలకు అధికారులు స్తంభాలను పక్కనే తరలించే పనులు ప్రారంభించారు. ఆదివారం విద్యుత్ స్తంభాలకు ఉన్న ఎల్‌సీ లేన్‌ను తొలగించే పనులు చేపట్టారు. ఈ క్రమంలో స్తంభం పైకి ఎక్కి పనులు చేపడుతున్న సిబ్బంది ఎలాంటి రక్షణ కవచాలు ధరించలేదు. కనీసం పట్టు కోసం తాళ్లను సైతం కట్టుకోకుండా ప్రమాదకరంగా పనులు చేపడుతున్నారు. ప్రమాదవశాత్తు అదుపు తప్పి కిందపడితే వారి ప్రాణాలకు ఆపాయం పొంచి ఉంది. సిబ్బందే కదా అన్న నిర్లక్ష్యపు ధోరణితో అధికారులే దగ్గరుండి మరీ ఎటువంటి రక్షణ కవచాలు అందించకుండా వారితో పనులు చేయించడం గమనార్హం.

డ్రంకెన్ డ్రైవ్‌లో 70 మందిపై కేసు నమోదు

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శనివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మేడ్చల్ బాలానగర్ ట్రాఫిక్ డీసీపీ పరిధిలోని 70 మంది వాహనదారులు పట్టుబడ్డారు. జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 24 మంది, బాలానగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 26 మంది, అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 20 మంది వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.

మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బీబీపేటకు చెందిన వేముల పరశురాములు(36), భార్య లత, పిల్లలతో కలిసి వేసవి సెలవులకు ఓల్డ్ అల్వాల్‌లో ఉండే బావమరిది ఇంటికి వచ్చాడు. అతను ఈ నెల 17న పని నిమిత్తం వెతుకుతూ బయటకు వెళ్లాడు. మళ్లీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం 4:30 గంటల సమయంలో కేపీ రెడ్డినగర్ సమీపంలో రోడ్డు పక్కన పరశురాములు మృతదేహం లభించింది. మృతుడికి కల్లు తాగే అలవాటు ఉందని, రెండు రోజులుగా తిండి తినకపోవడంతో చనిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుకు నేడు ఆఖరు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రవేశ పరీక్ష ఆధారిత డిప్లొమా, పోస్టుగ్రాడ్యుయేట్, డాక్టోరల్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను సమర్పించడానికి సోమవారం చివరి తేదీ. ప్రవేశ పరీక్షలను జూన్ 12,13,14 తేదీలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ (కంప్యూటర్‌సైన్స్, ఎంఎడ్, మాస్టర్ ఆఫ్ లా, బీటెక్ (కంప్యూటర్‌సైన్స్) ఎల్ఎల్‌బి, బీఎడ్, డీఎల్ఎడ్, పాలిటెక్నిక్ డిప్లొమోలలో ప్రవేశాలు అందిస్తారు, వివిధ పీహెచ్‌డీ కోర్సులకు కూడా దరఖాస్తులు కోరుతున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో చూసి దరఖాస్తును పూర్తి చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. మరిన్ని వివరాలకు 040-23006612 ఎక్స్‌టెన్షన్ 1801ను సంప్రదించాలి.

పెట్ కేర్ సెంటర్‌లో వ్యక్తి మృతి



నితిన్

అడ్డగుట్ట: లాలాగూడా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై గంగాధర్ తెలిపిన మేరకు .. వినోభా నగర్ ప్రాంతానికి చెందిన ముఖేష్ మూర్తి స్థానికంగా డాగ్స్ పెట్ కేర్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం నితిన్(45) అనే వ్యక్తి పనిలో చేరి అక్కడే పెంట్ హౌస్ లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటల సమయంలో నితిన్‌కు ముఖేష్ ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో పెంట్ హౌస్‌కి వెళ్లి చూడగా నితిన్ మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌కు దండిగా మామిడికాయ

పచ్చడి సీజన్ కావడంతో డిమాండ్





షాపూర్ నగర్ మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన వివిధ రకాల మామిడి కాయలు

సుభాష్‌నగర్: తెలుగు రాష్ట్రాల్లో అవకాయ అంటే ఇష్ట పడని వారుండరు.. వేడి వేడి అన్నంలో మామిడికాయ తొక్కు (పచ్చడి) వేసుకొని తింటే ఆ టేస్టే వేరు. ఇక పెరుగన్నంలో మామిడికాయ పచ్చడి లొట్టలేసుకుంటూ ఇట్టే తినేస్తాం. అలాంటి పాత కాలపు సాంప్రదాయ మామిడికాయ తొక్కుకు క్రేజీ తగ్గడం లేదు. షాపూర్‌నగర్‌లోని మార్కెట్ రోడ్డులో మామిడికాయల దుకాణాలు పదుల సంఖ్యలలో వెలిశాయి. ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మామిడికాయలను కొనుగోలు చేసి కట్ చేసి తీసుకెళ్తున్నారు.

మామిడి రకాలు

పచ్చడి కోసం బనగాన పల్లి, కొత్తపల్లి కొబ్బరి, తెల్ల గులాబీ, జిల్లాల, దేశవలి, సువర్ణ రేఖ, నాటు, మల్లిక, దషేరి, నీలం, చిన్న రసాలు, పెద్ద రసాలు వంటి వివిధ రకాల మామిడికాయలను పచ్చళ్ల కోసం అమ్మకానికి పెట్టారు. ఒక్కో మామిడికాయ పది రూపాయల నుంచి 60 రూపాయల వరకు విక్రయిస్తున్నారు.



మామిడికాయలను కట్ చేస్తూ..

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి



ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి మామిడికాయలను దిగుమతి చేసుకుంటున్నాం. గత పది రోజుల నుండి స్థానికంగా నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి మామిడికాయలు కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఆవకాయ తొక్కుకు మాత్రం క్రేజీ తగ్గడం లేదు.

– కాశి, మామిడికాయల వ్యాపారి